వైఎస్ఆర్ బీమా నగదు పంపిణీ

ప్రజాశక్తి-జి.మాడుగుల మండలంలో బోంజంగి గ్రామానికి చెందిన కొరబు మత్యలింగం నాయుడు ఇటీవల కాలంలో అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. ఈ మేరకు వైఎస్సార్ బీమా కింద తన భార్య కోరబు కాంతమ్మకు రూ.10వేలు శనివారం అందించినట్టు స్థానిక సర్పంచ్ రాంబాబు తెలిపారు మిగతా రూ.90వేలు త్వరలో లబ్ధిదారుని ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఈశ్వర్‌రావు, వాలంటీర్ సిరగం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నగదు ఇసున్న సర్పంచ్

మణిపూర్ ఘటనపై

మన్యంలో వెల్లువెత్తిన నిరసనలు

-ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ, గిరిజన మహిళా సంఘం ఆధ్వర్యాన ర్యాలీలు, రాస్తారోకోలు

ముంచంగిపుట్టులో ఆందోళన చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

మణిపూర్ అల్లర్లలో ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగింపు నిర్వహించిన ఘటనను ఖండిస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం, గిరిజన మహిళా సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసనలు మిన్నంటాయి. అరకువేలీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో చేపట్టారు. హుకుంపేట, ముంచంగిపుట్టు, పెదబయలు మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. డుంబ్రిగుడ మండలం సాగర పంచాయతీ అడపవలసలో గిరిజనులు ఆందోళన చేపట్టారు.

పెదబయలులో..

అరకులోయ రూరల్:మణిపూర్ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఆదివాసులపై హింసకాండ, అత్యాచారాలకు పాల్పడుతుందని ప్రజా సంఘాల నేతలు విమర్శించారు. అరకువేలి డిగ్రీ కళాశాల నుండి అరకువేలి మెయిన్ రోడ్డు వరకు ఆదివాసి గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ, గిరిజన మహిళ సంఘం ఆధ్వర్యాన శనివారం ర్యాలీ, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, మణిపూర్ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం హింసకాండ వెనుక మైనింగ్ మాఫియా ఉందని, అడవి ప్రాంతంలో తవ్వకాలు చేపట్టేందుకు కుట్ర పూరితంగా దాడులు, అత్యాచారాలకు ఒడిగడుతుందని దుయ్యబట్టారు.ఐద్వా మహిళ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు వివి జయ మాట్లాడుతూ, మణిపూర్ సంఘటనపై వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతుంటే ఇంటర్నేట్ సిగ్నల్ ఆపివేసి హింసను ప్రోత్సహించడం బిజెపి ప్రభుత్వం దుర్మార్గానికి నిదర్శనమన్నారు. గిరిజన మహిళ సంఘం మండల నాయకురాలు జి సన్యాసమ్మ, అరకువేలి ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ కె ధనలక్ష్మి, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు పి.కృష్ణ, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎస్.ఐసుబాబు, మండల ఉపాధ్యక్షులు కె.శాంతి, కె.బలరాం, మండల కమిటీ సభ్యులు కార్తీక్, సింగ్, ఆదివాసి గిరిజన సంఘ మండల కార్యదర్శి పి రామన్న, నాయకులు కె.మగ్గన్న, పి.రామ్ విద్యార్థులు పాల్గొన్నారు.

హుకుంపేట: బిజెపి ఉన్నంత కాలం మహిళలకు రక్షణ ఉండదని ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు తాపూల క్రిష్ణారావు తెలిపారు.మణిపూర్ లో గిరిజనులపై బీజేపీ హింసాకు నిరసనగా స్థానిక పెట్రోల్ బ్యాంక్ నుంచి మూడు రోడ్ల కూడలి వరకు కాలేజి విద్యార్థులతో గిరిజన మహిళ సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. గిరిజన మహిళ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.హైమావతి, సీపీఎం మండల కార్యదర్శి వి.లక్ష్మణ్‌రావు, గిరిజన సంఘం ఉప అధ్యక్షులు రామారావు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు:ఆదివాసీ గిరిజన సంఘం, ఆదివాసీ మహిళా సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయం నుండి నాలుగు రోడ్ల కూడలి వద్దకు భారి ర్యాలీ నిర్వహించారు.ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కె.నర్సయ్య, అధ్యక్షుడు ఎంఎం శ్రీను, మహిళా సంఘం(ఐద్వా) మండల అధ్యక్షులు ఈశ్వరి మాట్లాడుతూ, మతం పేరుతో మారణ హొమం సృష్టించడం బిజెపికి తగదన్నారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణ, లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్, సీపీఎం మండల కార్యదర్శి పి.భీమరాజు, మహిళ సంఘం మండల కార్యదర్శి విజయ, రాధ, ఎస్ఎఫ్ఐ నాయకులు కె.దోంబ్రు, పి.వరహాలు, మోహన్, బాషా వాలంటీర్స్ సంఘం నాయకులు కొండయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు:మండల కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సామూహిక అత్యాచారంకు పాల్పడిన వారిపై తక్షణమే క్రిమినల్ చర్యలు చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం పూర్వపు అధ్యక్షులు బోండా సన్నిబాబు డిమాండ్ చేశారు.ఆదివాసీ గిరిజనసంఘం జిల్లా కమిటీ సభ్యులు కిల్లో శరబన్న, జె.సునీల్ కుమార్, సీతగుంట పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ బొండా గంగాధర్, చెండా రామారావు, తదితరులు పాల్గొన్నారు

డుంబ్రిగుడ: సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు శనివారం ఆందోళన నిర్వహించారు. అనంతరం గిరిజన సంఘం అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ, సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎస్ బి పోతురాజు మాట్లాడుతూ, ఇద్దరు ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించడం చాలా దారుణమన్నారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, పాపారావు, వి.సురేషకుమార్, మంజుల, గోపాల్ చంద్ర పాల్గొన్నారు.

రాజవొమ్మంగి:మణిపూర్‌లో అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి ఆదివాసీ గిరిజన సంఘం, యుటిఎఫ్, సిఐటియు, చేతివృత్తులు, వర్తక, వ్యాపార సంఘాల ఆధ్వర్యంలో 99 క్వాటర్స్ నుండి స్థానిక అల్లూరి జంక్షన్ వరకు మహిళలు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అల్లూరి జంక్షన్ వద్ద కొవ్వొత్తులతో మానవహారం చేపట్టారు. ఆయా సంఘాల నాయకులు లోతా రామారావు, రమేష్, పైడిమల్లు, వెంకటలక్ష్మి, రమణి, రామరాజు, కె.వెంకటలక్ష్మి, ఆలీ, టి.శ్రీను మాట్లాడుతూ, రాజవొమ్మంగి సర్పంచ్ జి రమణి, లబ్బర్తి ఎంపిటిసి జి పెద్దిరాజు, ఆయా సంఘాల నాయకులు గుప్తా, కిరణ, బుజ్జి పాల్గొన్నారు.

రాజఒమ్మంగిలో....

సీలేరు : మణిపూర్‌లో శాంతిభద్రతలను నెలకొల్పడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందాయని భారతీయ ఆదివాసీల సమైక్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు గడుతూరు రాంగోపాల్ ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ, మెజార్టీ మెయితీలు గిరిజన తెగలపై దాడులు చేస్తున్నారని తెలిపారు.

మళ్లీ పెరుగుతున్న గోదావరి

గుట్టలపై గుడారాలు వేసుకుంటున్న బాధితులు

వీరయిగూడెం - నెల్లిపాక ల మధ్య మూడు రోజులుగా నిలిచిన వరద నీరు

ప్రజాశక్తి -ఎటపాక, విఆర్.పురం

గత రెండు రోజులుగా తగ్గుముఖం పట్టిన గోదావరి నీటి మట్టం శనివారం సాయంత్రం నుండి మళ్లీ పెరుగుతోంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా శ్రీరామసాగర్, ఏటూరు నాగారం, పేరూరు ప్రాజెక్టుల నుంచి శనివారం నీటి విడుదల చేయడంతో భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం నెమ్మదిగా పెరుగుతోంది. శనివారం సాయంత్రం 4 గంటలకు 39.5 ఉన్న గోదావరి నీటి మట్టం, సాయంత్రం 7 గంటల సమయానికి 40.5 అడుగులకు పెరిగింది. ఈ వరద ఇంకా పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. సహాయక చర్యల కోసం మర పడవలు, లాంచీలు సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. గతేడాది వరదలు సృష్టించిన బీభత్సాన్ని మరిచిపోని బాధితులు, ఈ ఏడాది ఇంకా వర్షాలు పెరిగి మళ్లీ వరద ఉధృతం అవ్వచ్చన్న భయంతో ముందుగానే గుట్టలపై పాకలు, గుడిసెలు వేసుకుంటున్నారు.

మరో వైపు ప్రస్తుతం వాగులు పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. విఆర్.పురం మండలం సుష్టివారి గూడెం వాగు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తుండడంతో దానికి ఇరువైపులా ఉన్న వెంకన్నగూడెం, చింతరాయపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శ్రీరామగిరి, సీతంపేట మధ్య గోదావరి వరద నీరు రోడ్డును తాకడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విఆర్.పురం మండలంలోని గోదావరి పరివాహక గ్రామాల ప్రజలు సామాన్లు సర్దుకొని సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు.

పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి

గతేడాది వరదల సందర్భంగా రాఘవపురం గ్రామం మొత్తం పక్కనున్న గుట్టపైకి ఎక్కి తలదాచుకున్నాం. ప్రభుత్వ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టలేదు. ఈ ఏడాది అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలి. వరదలొస్తాయని ప్రజలు భయాందోళన చెందుతుంటే అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదు. సచివాలయ వ్యవస్థ ద్వారా వరదల సమాచారాన్ని ప్రతి కుటుంబానికి చేర్చవచ్చు. కానీ అధికారులు ఆ విధంగా ఆలోచన చేయడం లేదు. కచ్చితమైన సమాచారం ఇస్తూ ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు సామాగ్రిని తరలించుకోడానికి వాహనాలను సిద్ధం చేయాలి. ప్రభుత్వం ముందస్తుగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి. అక్కడ మంచినీరు, మందులు అందుబాటులో ఉంచాలి.

- సొందె రామారావు, సిపిఎం ఎటపాక మండల కమిటీ సభ్యులు, రాఘవపురం,

ప్రతి పంచాయతీలోనూ పునరావాస కేంద్రం

మంపునకు గురైన టేకులబోరు- కొండ్రాజుపేట రహదారిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

- వరద బాధితులకు నిత్యావసరాలు అందించాలి
- సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్ డిమాండ్

ప్రజాశక్తి-కూనవరం

ప్రతి పంచాయతీలోనూ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. కూనవరం మండలం కొండ్రాజుపేట గ్రామంలో సిపిఎం నాయకులు పర్యటించారు. ముంపునకు గురై రాకపోకలు నిలిచిపోయిన కొండ్రాజుపేట- టేకులబోరు రహదారిని పరిశీలించారు. అక్కడి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ముంపు బాధితులకు ఏమి ఇచ్చారని ప్రశ్నించారు. ఆగస్టు నెల బియ్యం ఇచ్చి ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం తగదన్నారు. మిగతా పప్పులు, నూనెలు, ఇతర నిత్యావసరాలు, కూరగాయలు ఎవరిస్తారని ప్రశ్నించారు. ప్రతి ఏటా గోదావరి వరదలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, ఆ నిధులు వైసిపి ప్రభుత్వం ఎందుకు ఖర్చు చేయడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ మండల కేంద్రానికి దగ్గరగా ఉన్న గిరిజన గ్రామాలు కొండ్రాజుపేట, పూసుగూడెం, శబరి కొత్తగూడెం, కొత్తూరు, చిన్నార్యార్ గ్రామాల ప్రజలు కొండరాజుపేట-టేకులబోరు మధ్య రాకపోకలకు పడవ ఏర్పాటు చేయాలని కోరుతున్నా ప్రభుత్వ స్పందించకపోవడం దారుణమన్నారు. ముంపు బాధితులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలను సమీకరించి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సాయం సీతారామయ్య, మండల కమిటీ సభ్యులు పాయం సత్యనారాయణ, తాలూరి శ్రీనివాసరావు, సర్పంచ్ మడకం నాగమణి, ఎంపీటీసీ అమ్ములు, ధర్మాజీ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు టార్పాలిన్లు ఇవ్వాలి

ఎంపిటిసి ప్రదీప్ కుమార్, సర్పంచ్ లక్ష్మి

ఎత్తైన ప్రాంతంలో పాకలు వేసుకుంటున్న వరద బాధితులతో మాట్లాడుతున్న ఎంపిటిసి ప్రదీప్‌కుమార్

ప్రజాశక్తి-విఆర్.పురం

వరద బాధితులకు టార్పాలిన్‌లు అందించాలని పెద్దమట్లపల్లి ఎంపిటిసి సభ్యులు పూనెం ప్రదీప్ కుమార్, సర్పంచ్ వెట్టి లక్ష్మి డిమాండ్ చేశారు. పెద్దమట్టపల్లి గ్రామ పంచయతీ పరిధిలోని నూతిగూడెం, గుర్రంపేట గ్రామాల ప్రజలు వరదల నేపథ్యంలో సురక్షిత ప్రాంతానికి తరలివెళ్ళారు. ఎంపిటిసి ప్రదీప్‌కుమార్, సర్పంచ్ వెట్టి లక్ష్మి తదితరులు శనివారం ఆ ప్రాంతానికి వెళ్లి, బాధితులను పరామర్శించారు. వారు పడుతున్న బాధలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవిలో ఎత్తైన ప్రాంతంలో వరద బాధితులు గుడిసెలు వేసుకునేందుకు ప్రభుత్వం టార్పాలిన్‌లు ఇవ్వాలని కోరారు. గతేడాది వరదలకు వర్షంలో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారని, ఈ ఏడాది కూడా టార్పాలిన్‌లు అందిచకపోతే ఎలా అని ప్రశ్నించారు. గతేడాది వరద ముంపునకు జగన్ ప్రభుత్వం నష్టపరిహారం కింద రూ.10వేలు ఇస్తామని చెప్పి, రూ.2000 ఇచ్చి చేతులు దులుపుకుందని, రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే వరదల నేపథ్యంలో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.

గ్రామాల్లో సిపిఎం ప్రజాప్రతినిధుల పర్యటన

విఆర్.పురం : వరదల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకోవడానికి మండలంలోని రామవరం, సోములగూడెం, చొప్పల్లి గ్రామాల్లో శనివారం ఎంపిపి కారం లక్ష్మి, స్థానిక సర్పంచ్ కారం బుచ్చమ్మ, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు తదితరులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవిలో పాకలు వేసుకుంటున్న రామవరం గ్రామస్తులకు బరకాలు ఇవ్వాలని, నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, గూటాల శ్రీనివాసరావు, సోడి మల్లయ్య, శ్రీరపు తాతబాబు, కారం సత్తిబాబు, ఆసులక్ష్మయ్య పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షాలు

పొంగిపొర్లుతున్న కొండవాగులు



సున్నంపాడు - నూరిపూడి గ్రామాల మధ్య పొంగిపొర్లుతున్న కొండ కాలువ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలో వారం రోజుల నుండి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఒక్కసారిగా జనజీవనం స్తంభించబడింది. మారేడుమిల్లిలో శనివారం వారపు కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుండి సంతకు వచ్చే గిరిజనులు వాహనాల రాకపోకలు లేక నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండవాగులు పొంగిపొర్లి రోడ్డుమీదికి రావడంతో రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. రోడ్లపై వృక్షాలు కూలి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలో లోతట్టు గ్రామాలైన కొండవాడ, ఉత్తలూరు, రామన్న వలస, నెల్లూరు గ్రామాల్లో కరెంట్ తీగలపై వృక్షాలు పడి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి తమకు కరెంటు వచ్చే విధంగా చూడాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

సాంకేతిక సమస్యలు సరిచేయాలి

జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి:జగనన్న సురక్ష ధ్రువపత్రాల జారీలో ఆన్లైన్‌లో సమస్యలు సరి చేయాలని జెడ్పిటీసి దీసరి. గంగరాజు సూచించారు. మండలంలో టోకూరు పంచాయతీలో సర్పంచ్ కిల్లో .మోస్య అధ్యక్షతన శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలం ప్రత్యేక అధికారి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి సూర్యలక్ష్మి, గంగరాజు ముఖ్య అథితులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, జగ్గన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం 11 రకాల ధృవీకరణ పత్రాలు ఉచితంగా అందిస్తుందని తెలిపారు. హౌస్ మ్యాపింగ్ లేనందున రేషన్ కార్డులు, ఆధార్ కార్డుల నమోదు కాలేదని అన్నారు.స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణీ మాట్లాడుతూ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ప్రజలకు పథకాలు అందేలా చూడాలని సూచించారు. లబ్ధిదారులకు కుల ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నక్కా .రవికుమార్, మాజీ సర్పంచ్ సారా .దొన్ను, టోకూరు, బొర్రా, .అనంతగిరి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు వార్డు సభ్యులు దోన్ను, చందర్రావు పాల్గొన్నారు.

మాట్లాడుతూన జెడ్పీటీసీ గంగరాజు

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లాలో అర్హత కలిగిన 9,10, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బిసి, ఇబిసి, సంచార జాతుల కులాలకు చెందిన విద్యార్థుల నుంచి పిఎం యశస్వి ఉపకార వేతనాలు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బిసి సంక్షేమ, సాధికారత అధికారిణి జె.రాజేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు వచ్చే నెల 10వ తేదీ లోపు %https://yet.nta.ac.in% వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ధరఖాస్తుకు తమ ఫోన్ నెంబర్, ఆధార్, ఆధార్ కార్డ్‌తో అనుసంధానమైన బ్యాంక్ పాస్ పుస్తకం, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను అప్లోడ్ చేయాల్సి ఉంటుదన్నారు.సెప్టెంబర్ 29న ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ పథకం కింద ఎంపికైన 9వ తరగతి విద్యార్థులకు ఏడాదికి రూ.75 వేలు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఏడాదికి రూ.1.75 లక్షలు వరకు ఉపకార వేతనాలు విడుదల చేయనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.50 లక్షలు మించరాదని, పూర్తి వివరాలకు %https: //socialjustice.gov.in/scheme% వెబ్ సైట్ ను సందర్శించాలని పేర్కొన్నారు.

పాడేరు టౌన్: పాడేరు ఐటిడిఎ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉపాధ్యాయ, అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 నుంచి 28 లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. పిజిటి, జెఎల్ పోస్టులకు సంబంధిత మాస్టర్ డిగ్రీలో 50శాతం, బిఇడిలో 50శాతం పైబడి సంబంధిత సబ్జెక్టులలో మెథడాలజి కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఇంగ్లీష్ మీడియం అభ్యర్థులు అర్హులని, బాలికల పాఠశాల, కళాశాలలో పని చేయుటకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఈనెల 29, 30 తేదీల్లో దరఖాస్తుల ధ్రువీకరణ చేస్తామని తెలిపారు. ఈనెల 31, ఆగస్టు 1వ తేదీలలో ఎపిటిడబ్ల్యూఆర్ జెసి (జి)లో డెమో నిర్వహిస్తామని, అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు గురుకులం ఫోన్:9491030243, 9492929375 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

మండల విద్యాశాఖాదికారి బాలాజీ

ప్రజాశక్తి- అనంతగిరి:విధి నిర్వహణలో ఉపాధ్యాయులు అలసత్వం వహిస్తే తగు చర్యలు తప్పవని మండల విద్యాశాఖాదికారి బాలాజీ హెచ్చరించారు. శనివారం పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. మండలంలోని కొండిబ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, నడిమివలస పాఠశాల లను మండల విద్యాశాఖాదికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమయపాలన పాటించాలన్నారు. టీచింగ్ నోట్స్. డైరీ, లెసన్ ప్లాన్ కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు ముఖ ఆధారిత హజరు నిర్దేశించిన సమయంలో వేయాలని, మద్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన అమలుపై ఫిర్యాదులు వస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట నడిమివలస, కొండిబ ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరరావు, రామకృష్ణ, కొండిబ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ స్వరూప పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పరిశీలిస్తున్న ఎంఇఒ

నేడు మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండలంలోని బొండం పంచాయతీ కొత్తవలస గ్రామంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సాయి వైబ్రియోనిక్స్ సహకారంతో ఈనెల 23న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామని నాయకులు తెలిపారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు బుజ్జి బాబు తెలిపారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : నేడున్న ప్రత్యేక పరిస్థితుల్లో బోధనలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు, ఛాత్రోపాధ్యాయులకు స్థానిక ప్రభుత్వ డైట్ ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్ పిలుపునిచ్చారు. స్థానిక డైట్‌లో శనివారం ఇంటర్నెట్ ఫ్లాట్ ప్యానెల్ అంశంపై డైట్ అధ్యాపకులకు, చాత్రోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపల్ సుధాకర్ మాట్లాడుతూ, సాంకేతికతను ఉపయోగించని ఉపాధ్యాయులు వృత్తిలో వెనుకబడిపోతారని తెలిపారు. డైట్ అధ్యాపకులు గొట్టేటి రవి మాట్లాడుతూ, పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ నిర్వహించడం విద్యా విప్లవానికి నాంది అన్నారు. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఈ నెల 24 నుంచి సొంత గ్రామాలు, ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలో పాఠ్య భోధన చేయాల్సి ఉందని చాత్రోపాధ్యాయులకు సూచించారు. ఫ్లాట్ ప్యానెల్‌లో బ్లాక్, వైట్ బోర్డు, పలు రంగుల రాతలు, ఇంటర్నెట్ బ్రౌజింగ్, ఫోన్ ద్వారా స్క్రీన్ కాస్టింగ్, బ్లాక్ బోర్డు వర్క్‌ను నిక్షిప్తం చేయడం, ఫ్లాట్ ప్యానెల్‌తో పెన్ డ్రైవ్, లా ప్టాప్ మొదలైనవి అనుసంధానించడం తదితర అంశాలలో శిక్షణ ఇచ్చారు.

జాతీయ మేధోహక్కుల ఉత్సవంలో పాల్గొన్న ప్రతినిధులు

గీతంలో జాతీయ మేధోహక్కుల ఉత్సవం

ప్రజాశక్తి-మధురవాడ : అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం టెక్నాలజీ ఎనేబిలింగ్ సెంటర్ (జి-టెక్) ఆధ్వర్యాన పూణేలోని సిఎస్ఐఆర్ నేషనల్ కెమికల్ లేబరేటరీ సహకారంతో జాతీయ మేధోహక్కుల ఉత్సవాన్ని శనివారం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ కళాశాలలు, పరిశ్రమల నుంచి 700 మంది హజరయ్యారు. సిఎస్ఐఆర్ నేషనల్ కెమికల్ లేబరేటరీ మేధో హక్కుల విభాగం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నితిన్ తివారి ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. విద్యాలయాలలోని ప్రయోగశాలలలో జరిగే అధ్యయనాలు వాటి ఫలితాలు పారిశ్రామిక ఉత్పత్తులుగా మారాలన్నారు. పరిశోధన ఫలితాలను విధిగా మేధోహక్కుల కింద నమోదు చేసుకోవాలని సూచించారు. గీతం రీసెర్చి విభాగం డైరక్టర్ డాక్టర్ రాజా పప్పు మాట్లాడుతూ, గీతం జిటెక్ విభాగం ద్వారా పరిశ్రమలకు, విద్యాలయాలకు మధ్య సంబంధాలను నెలకొల్పే ప్రయత్నం చేస్తున్నామన్నారు. జి-టిక్ కోఆర్డినేటర్ సోమ్ భట్ కార్యక్రమ ప్రాధాన్యతను తెలియజేశారు.

సామూహిక సీమంతం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 33వ వార్డు అల్లిపురం, కుమ్మరవీధి సచివాలయం పరిధి అంగన్‌వాడీ కేంద్రంలో దక్షిణ నియోజకవర్గ వైసిపి నాయకులు సీతంరాజు సుధాకర్ సహకారంతో వార్డు వైసిపి నాయకులు పచ్చిరపల్లి రాము ఆధ్వర్యాన సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. 115 మంది గర్భిణులకు పసుపు, కుంకుమతో పాటు గాజులు, చీర, స్వీట్స్, పండ్లు, హార్లిక్స్ పాకెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పివిఎన్.రెడ్డి, పోలవరపు దుర్గాప్రసాద్, బొడ్డేటి పోలారావు, ఆర్.రామలింగేశ్వరరెడ్డి, కె.పైడిరాజురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పి.శిరీషకుమారి, పి.లావణ్య, నానాజీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేలో వాలంటీర్లను వినియోగిస్తే చర్యలు

డిఆర్ఒ అంబేద్కర్

ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న డిఆర్ఒ

ప్రజాశక్తి-పాడేరుటౌన్:ఓటరు జాబితా పరిశీలనలో ఇంటింటి సర్వే పక్కాగా జరగాలని, శత శాతం సర్వే పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్ ఆదేశించారు. పాడేరు నియోజకవరర్గం ఫరిధిలోని పాడేరు మండలం పి.గొందూరు గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను శనివారం డిఆర్ఒ ఆకస్మికంగా తనిఖీ చేసారు. బిఎల్ఒ వెంకటలక్ష్మి నుండి సర్వే వివరాలు రాబట్టారు. సర్వే చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. బిఎల్ఒ యాప్‌లో పూర్తి వివరాలను పరిశీలించాలని సూచించారు. ఫోటో, పేరు, వయసు, లింగం తదితర వివరాలు సరి పోల్చాలని ఆదేశించారు. ఇంటింటి సర్వేలో చేర్పులు, తొలగింపులు ఉంటే సంబంధిత ఫారం 6, 7 లను ఆన్ లైన్‌లో చేయాలని ఆదేశించారు. ఇంటింటి సర్వేలో ఎట్టి పరిస్థితులలోనూ వాలంటీర్ల సేవలు వినియోగించరాదని, ఇది ఎన్నికల కమిషన్ సూచనలకు వ్యతిరేకమని తెలిపారు. ఎక్కడైనా వాలంటీర్ల సేవలను వినియోగిస్తున్నట్లు దృష్టికి వస్తే వారిపై నిభంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ, జిల్లాలో 1008 బూత్ లెవల్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారని, ప్రతి రాజకీయ పార్టీ ఆయా పార్టీ ఏజంట్లను నియమించిందని, ఇంటింటి సర్వేలో రాజకీయ పార్టీల ఏజంట్లు కూడా భాగస్వాములవ్వాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఉప తహసిల్దార్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి

'మధ్యాహ్న' భోజన సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసన్న

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం మధ్యాహ్న భోజనం పథకం సంఘం నిర్వాహకుల డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కే.ప్రసన్న మాట్లాడుతూ, పాదయాత్ర సమయంలో మధ్యాహ్నం భోజనం నిర్వాహకులకు వేతనాలు పెంచుతానని సిఎం జగన్ అప్పట్లో హామీ ఇచ్చారన్నారు. నేటికీ నెరవేర్చ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి, యూనిఫారం, గుర్తింపు కార్డులు, గ్యాస్, వంట పాత్రలు ప్రభుత్వం ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించి, పెరుగుతున్న ధరలకు అనుకూలంగా బడ్జెట్ లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేదింపుల అరికట్టాలన్నారు. ఈ సమస్యలపై ఈ నెల 31న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిరికి అమ్మాజీ, చిన్న తల్లి, లక్ష్మి, దుర్గ భవాని, నూకరాజు, పాల్గొన్నారు.

విశాఖ గాయనీగాయకుల సంఘం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖకు చెందిన పలువురు గాయనీగాయకులు, సంగీత సంస్థలు నూతనంగా ఏర్పాటు చేస్తున్న విశాఖ గాయనీగాయకుల సాంస్కృత సంఘం పోస్టర్‌ను ప్రముఖ సంగీత దర్శకులు ఆర్‌పి పట్నాయక్ శనివారం ఆవిష్కరించారు. పౌర గ్రంథాలయంలో నూతన కార్యవర్గ ప్రతినిధుల సమక్షంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశాఖలో గాయనీగాయకులు, సంగీత సంస్థలు సంయుక్తంగా సంఘం ఏర్పాటుచేసుకోవడం ఐక్యతకు నిదర్శనం అన్నారు. గాయనీగాయకులు నిబద్ధతతో నిత్యం సాధన చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యవర్గ సభ్యులు డి.భూపతిరావు, భయ్యా శ్రీనివాస్, ఎంవిఆర్. నాగేశ్వరరావు, ఫణిస్వామి, సన్ మూర్తి, శశికళ, పట్టం వెంకటేష్, నాంచారయ్య, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు ఎన్.డి.పాల్, నరవ ప్రకాశరావు, పౌర గ్రంథాలయం కార్యదర్శి వర్మ, సీనియర్ సభ్యులు డి.వి.సూర్యారావు, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అనుకూలంగా గ్రంథాలయం : ఆర్‌పి

గ్రంథాలయం చదువుకోవడానికి విద్యార్థులకు ఎంతో అనుకూలంగా ఉందని సంగీత దర్శకులు ఆర్‌పి.పట్నాయక్ అన్నారు. పౌరగ్రంథాలయంలో ప్రత్యేక కార్యక్రమానికి వచ్చిన ఆయన లైబ్రరీని పరిశీలించారు. పోటీ పరీక్షలకు చదువుకునే విద్యార్థులకు చక్కటి వాతావరణం ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు.

వ్యవసాయానికి ఆరు డ్రోన్లు మంజూరు

ప్రజాశక్తి-ఆనందపురం : వ్యవసాయ పనుల నిమిత్తం ఆనందపురం మండలానికి ఆరు డ్రోన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని వ్యవసాయాధికారి సంధ్యా రత్నప్రభ తెలిపారు. కూలీల కొరతతో రైతులు సకాలంలో ఎరువులు, పురుగు మందులు పొలాల్లో వేసుకోలేని పరిస్థితులు నెలకొనడంతో డ్రోన్లు వినియోగించడానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల ఐదుగురు రైతులు కలిసి ముందుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా కస్టమర్ హైరింగ్ సెంటర్ (సీహెచ్సీ)ను ఏర్పాటుచేసుకోవాలని తెలిపారు. వారిలో ఐటిఐ లేదా ఇంటర్మీడియట్ చదివిన ఒకరిని పైలెట్‌గా ఎన్నుకుంటే వారికి వ్యవసాయ శాఖ ద్వారా గుంటూరులో 15 రోజులపాటు శిక్షణ అందిస్తారని వివరించారు. డ్రోన్ కొనుగోలుకు గ్రూపు సభ్యులు 10 శాతం వాటా చెల్లిస్తే, ప్రభుత్వం 40 శాతం రాయితీ, 50 శాతం బ్యాంక్ రుణంతో సుమారు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు విలువ చేసే డ్రోన్‌ను ప్రభుత్వం సమకూరుస్తుందని తెలిపారు. ఆ డ్రోన్లతో పొలంలో పురుగు మందులు పిచికారీతోపాటు, విత్తనాలు, జల ఎరువులు కూడా చల్లడానికి వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. అద్దె ప్రాతిపదికన ఇతర రైతులకు డ్రోన్ల సేవలు అందించవచ్చని తెలిపారు. ఈ మేరకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అర్హత గల వారిని ఎంపిక చేసి శిక్షణకు పంపిస్తామని పేర్కొన్నారు.

నేరాలు ఘోరాలు

ఏడాదిన్నర కుమార్తెను చంపిన తల్లి

గీతాశ్రీ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-ఉక్కునగరం : దువ్వాడ మంగళపాలెం జెఎన్ఎన్‌యుఆర్ఎం హౌసింగ్ కాలనీలో 18 నెలల చిన్నారిని కన్న తల్లే కడతేర్చిన సంఘటన చోటుచేసుకుంది. గాజువాక ప్రియదర్శిని కాలనీకి చెందిన బంగారు స్నేహ (19)కు సాయితో ప్రేమ వివాహం జరిగింది. వీరిద్దరూ విజయవాడలో ఉంటున్నారు. పాప పుట్టిన తర్వాత భర్తకు చెప్పకుండా బంగారు స్నేహ విశాఖపట్నం వచ్చేసింది. ఇక్కడ మలమంచిలి చెందిన బంధువు నిమ్మకాయ రమణతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ నెల 17వ తేదీన రాత్రి 10:30 గంటల సమయంలో కుమార్తె గీతాశ్రీ ఏడుస్తుందని స్టీల్ గరిటేతో బలంగా కొట్టింది. దీంతో పాప మృతిచెందింది. ఏమి చేయాలో తోచని స్థితిలో పెరట్లో గొయ్యి తీసి పాపని ఖననం చేసింది. శనివారం బంగారు స్నేహ తల్లిదండ్రులు వచ్చి పాప ఏదమ్మా అని అడగ్గా పొంతనలేని సమాధానం చెప్పింది. దీంతో తండ్రి గట్టిగా అడగడంతో జరిగిన విషయం చెప్పింది. స్నేహ తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. పాప మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు.

లారీ ఢీకొని యువతికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -మధురవాడ : జాతీయ రహదారిపై మధురవాడ కూడలిలో శనివారం లారీ ఢీకొని యువతికి తీవ్ర గాయాలయ్యాయి. సిఐ వై.రామకృష్ణ కథనం ప్రకారం... జివిఎంసి 5వ వార్డు పరిధి మారికివలస రాజీవ్ గృహాలకు చెందిన ఎస్.షర్మిల మధురవాడ కూడలి వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో కొమ్మాది నుంచి నగరం వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువతికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు తండ్రి సింహాచలం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాత పూర్వక హామీ కావాలి

'గంగవరం' చర్చల్లో కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలపై యాజమాన్య ప్రతినిధులు చేసిన ప్రతిపాదనలపై రాత పూర్వక హామీ కావాలని, లేకుంటే ఉద్యమం కొనసాగుతుందని కార్మిక నేతలు స్పష్టంచేశారు. కనీస వేతనం కోసం గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు శనివారం నాటికి 19వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరాన్ని అదాని గంగవరం పోర్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జిజె.రావు శనివారం సందర్శించి కార్మికులతో మాట్లాడారు. సర్క్యూట్ హౌస్‌లో శుక్రవారం జరిగిన చర్చల ప్రకారం చేసిన నిర్ణయాలను యాజమాన్యం అమలుచేస్తుందని, అందరూ షిప్టుల ప్రకారం విధులకు హాజరు కావాలని జిజె.రావు కోరారు. కార్మికులందరికీ దసరా నెలకు సంబంధించి రూ.పదివేలు ఇస్తామని, సమ్మె కాలానికి జీతం చెల్లిస్తామని, విధుల నుంచి తొలగించిన ఐదుగురిని తీసుకుంటామని తెలిపారు. వచ్చే ఏడాది ఇంక్రిమెంటులో కొంత మొత్తం కలిపి ఇస్తామని, ఇకపై ఇంక్రిమెంటు సమయంలో కార్మికులతో ముందుగా చర్చిస్తామని చెప్పారు. దీనిపై కార్మికులు స్పందిస్తూ తామంతా చర్చిస్తామని, ఎమ్మెల్యేతో మాట్లాడతామని, తర్వాత యాజమాన్య ప్రతిపాదనలపై రాతపూర్వకంగా హామీ ఇస్తే అప్పుడు ఆలోచిస్తామని స్పష్టం చెప్పారు. కార్మికులు ఎమ్మెల్యే వద్దకు వెళ్లి విషయాన్ని తెలియజేశారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి స్పందిస్తూ అదానీ గంగవరం పోర్టు యాజమాన్యంతో మాట్లాడారు. పోర్టు యాజమాన్య ప్రతినిధులు రాతపూర్వకంగా ఇవ్వడానికి నిరాకరించారు. దీంతో కార్మికులు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి కొవిరి అప్పలరాజు, గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు, నాయకులు వాసుపిల్లి ఎల్లాజీ, గంటిపల్లి అమ్మోరు, మాదా అప్పారావు, కదిరి సత్యానందం, నల్లి స్వామి, గంటిపిల్లి లక్ష్మయ్య, కొవిరి అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.

యాప్‌ల మోసాలపై అవగాహన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: ఆన్లైన్ బెట్టింగ్, లివింగ్, ఫ్రెండ్షిప్ వివిధ యాప్స్‌ను తక్షణమే నిషేధించాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. పట్టణంలో వివిధ కోచింగ్ సెంటర్లలో ఆన్లైన్ మోసాలను అరికట్టాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

పారదర్శకంగా ఓటర్ల సర్వే

ప్రజాశక్తి - రంపచోడవరం : బూత్ లెవెల్ అధికారులు ఓటర్ల సర్వేను పార్టీలకు అతీతంగా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో రంపచోడవరం, మారేడుమిల్లి, గంగవరం మండలాలకు సంబంధించిన ఎన్నికల బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నుండి వచ్చేనెల 21వ తేదీ వరకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధన ప్రకారం ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలని సూచించారు. రంపచోడవరం నియోజకవర్గంలో 394 బూత్‌లు ఉన్నట్లు చెప్పారు. ఫారం-6, ఫారం- 7, ఫారం 8 ప్రతిరోజు ఎన్ని సర్వే చేసిందీ యాప్‌లో పొందుపరిచాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలుంటే సంబంధిత తహశీల్దారుతోగాని, రంపచోడవరం సబ్ కలెక్టర్‌తోగాని సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, డిప్యూటీ తహశీల్దార్లు బి.రాజు, వీరభద్రరావు, సీనియర్ అసిస్టెంట్లు డి.ఇందిరా, టి.లక్ష్మణరావు, మూడు మండలాలకు చెందిన బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద విక్రయాలు, తలనీలాలకు వేలం పాట

ప్రజాశక్తి - సీలేరు : : జీకే వీధి మండలం దారాలమ్మ అమ్మవారి ఆలయంలో పూజా సామగ్రి విక్రయాలు, తలనీలాలు సంబంధించిన వేలం పాట శనివారం దేవాదాయ శాఖ అధికారి సాంబశివరావు, దారకొండ సర్పంచ్ నడిగట్ల రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అమ్మవారికి భక్తుల సమర్పించిన చీరలు, రవికలకు వేలం నిర్వహించారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలానికి చెందిన సిరిపల్లి సత్యనారాయణ వేలంపాటలో రూ.3.54 లక్షలకు దక్కించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద ఫొటోలు, యంత్రాలు, తాళ్లు విక్రయించేందుకు వేలంపాట నిర్వహించగా దారకొండ నివాసి ఎం.నాగేశ్వరరావు రెండు లక్షల నాలుగు వేల రూపాయలకు దక్కించుకున్నారు. అదే గ్రామానికి చెందిన గొర్లే గణేశ్వరరావు అమ్మవారికి భక్తులు సమర్పించిన తలనీలాల పాటలో పాల్గొని 1 లక్ష వెయ్యి రూపాయలకి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ అధికారి సాంబశివరావు మాట్లాడుతూ వేలంపాట పాడుకున్న ఆసామి నుండి 50శాతం డబ్బులు వేలంపాట వద్ద కట్టించుకోవడం జరిగిందని, మిగతా 50శాతం మూడు నెలల వ్యవధిలో చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు ఈశ్వరరావు, చంద్ర తేజ రామకృష్ణ, దారకొండ ఎంపీటీసీ ఎం.రామన్న, మాజీ ఎంపీటీసీ పోతురాజు గోవిందు, టిడిపి నాయకులు పోతురాజు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో ఉచితంగా ఇ - ఆటో సేవలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పర్యావరణం, కాలుష్య నియంత్రణలో భాగంగా ఆర్కే బీచ్ రోడ్డులో ఇ-ఆటో సర్వీస్‌లను ప్రారంభించినట్లు జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జివిఎంసి పరిధిలో విశాఖపట్నం నుంచి చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పథంలో భాగంగా అర్బన్ క్లైమేట్ చేంజ్, రేజివిన్స్ ట్రస్ట్ నిధుల ద్వారా ఆసియా అభివృద్ధి బ్యాంకు వారి ఆర్థిక సహాయంతో ఐదు ఆటోలు సమకూర్చామన్నారు. వీటిని కోస్టల్ బ్యాటరీ నుంచి సాగర్ నగర్ బీచ్ వరకు విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులు, పిల్లలు, బాలింతలకు ఉచితంగా రవాణా సౌకర్యం అందించేందుకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ సర్వీసులు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

జిసిసి అభివృద్ధికి ప్రభుత్వం కృషి

సంస్థ చైర్‌పర్సన్ శోభ స్వాతి రాణి

సిబ్బందితో మాట్లాడుతున్న స్వాతి రాణి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాష్ట్రంలో గిరిజన సహకార సంస్థ (జిసిసి) అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఆ సంస్థ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి అన్నారు. జిసిసి సంస్థ ద్వారా ఏడాదికి రూ.500 కోట్లు వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజవొమ్మంగి జిసిసి కార్యాలయాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈసందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేషన్ మరింత అభివృద్ధి సాధించిందని చెప్పారు. జిసిసి ఉద్యోగులకు హెల్త్ స్కీమ్ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రకృతి విధానంలో సాగు చేయబడుతున్న పసుపు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని, టీటీడీకి పసుపు, తేనే అభిషేకం నిమిత్తం సప్లై చేయడం జరుగుతుందని చెప్పారు. జీసీసీ ద్వారా సేకరించిన తేనె బెంగళూరు పంపిస్తున్నామన్నారు. అరకు కాఫీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందన్నారు. జిసిసి ఉత్పత్తులను తెలంగాణతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో విక్రయించడం జరుగుతుందని తెలిపారు. జిసిసికి అధిక ఆదాయం వచ్చే పెట్రోల్ బంకులను రాష్ట్రమంతటా ఏర్పాటు చేస్తామన్నారు. రాజవొమ్మంగి మండలంలో జడ్డంగి ఎన్‌హెచ్-5ఈ రోడ్డును ఆనుకుని ఉన్న స్థలాన్ని పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడానికి పరిశీలించినట్లు చెప్పారు. ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ పరిశీలించామన్నారు. పోలవరం బుట్టాయిగూడెంలో చిల్లీ ప్రాసెస్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పాడేరు డివిజన్లో డౌనూరు వద్ద, విశాఖ జిల్లా వేములవలస వద్ద కోల్డ్ స్టోరేజ్ పాయింట్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిసిసి డిఎం పార్వతీశం, డైరెక్టర్ తెల్లం చిన్నారావు, రాజవొమ్మంగి, ఎటపాక జిసిసి మేనేజర్లు విజయలక్ష్మి, జక్కారావు, సిబ్బంది వెంకటరావు, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో మందులు

రికార్డులు పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ బాషా

ప్రజాశక్తి - సీలేరు : అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తిస్థాయిలో మందులు ఉన్నాయని డిఎంహెచ్ఓ జమీర్ బాషా అన్నారు. జీకే.వీధి మండలంలో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆకస్మిత తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగానే సీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని మందులు స్టాక్ రూము, ల్యాబ్ రికార్డులు పరిశీలించారు. అనంతరం వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లితో సమావేశమయ్యారు. సీలేరు పీహెచ్సీలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ కేసులు ఎన్ని నమోదయ్యాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. జ్వరాలు వస్తే వ్యాధి నిర్ధారణకు పరీక్షలు చేయాలన్నారు. దోమలు పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. మలేరియా పాజిటివ్ వచ్చే గ్రామాల పరిధిలో 50 నుంచి 100 ఇల్లు వరకు రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీలేరు పిహెచ్‌సి వైద్య అధికారులు ఖాదర్ మస్తాన్ వల్లి, సౌమ్య, హెల్త్ సూపర్వైజర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు రుణాల పంపిణీ

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు ఎంపీపీ బడుగు రమేష్, పిఎసిఎస్ చైర్మన్ సుమర్ల సూరిబాబు చేతుల మీదుగా రుణాలను శనివారం పంపిణీ చేశారు. రూ.3.30 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి రమేష్ మాట్లాడుతూ రైతులు సహకార బ్యాంకులను బతికించుకోవాలని, అందుకు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం ఉద్యోగులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మి

ఆశ్రమ పాఠశాలల్లో సిబ్బందిని నియమించాలి

ప్రజాశక్తి - విఆర్.పురం : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్లు, రెగ్యులర్ ఏఎన్ఎంలను నియమించాలని ఎంపిపి కారం లక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని సోములగూడెం ఆశ్రమ పాఠశాలను సిపిఎం నాయకులతో కలిసి ఆమె సందర్శించారు. విద్యార్థుల మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో నైట్ వాచ్‌మెన్, రెగ్యులర్ ఏఎన్ఎం లేనట్లు విద్యార్థులు ఎంపిపి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపిపి లక్ష్మి మాట్లాడుతూ వరదల సమయంలో విద్యార్థులకు రెగ్యులర్ వైద్య పరీక్షలు చేయాలని, ఇందు కోసం ఏఎన్ఎం రెగ్యులర్‌గా ఉంచాలని, మందులు ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కారం బుచ్చమ్మ, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య గూటాల శ్రీనివాసరావు, సోడి మల్లయ్య, శ్రీరపు తాతబాబు, కారం సత్తిబాబు, ఆసు లక్ష్మయ్య పాల్గొన్నారు.

టీకాలపై అవగాహన

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం గర్భిణులు, చిన్నారులకు వేసే టీకాలపై ఆశా, అంగన్వాడీ వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ నాగభూషణం, సీలేరు వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి మాట్లాడుతూ గర్భిణులకు, అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి పది సంవత్సరాలు లోపు వారికి నిబంధనల ప్రకారం టీకాలు వేశారో లేదో ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలని ఆదేశించారు. ప్రజలకు టీకాలపై పూర్తి అవగాహన కల్పించాలని కోరారు. జులై ఆగస్టు నెలల్లో గర్భిణులు, పిల్లలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ విఒ వరలక్ష్మి, సూపర్వైజర్ మోహిని, దారకొండ ఎంపీహెచ్ఈఓ పోతురాజు, సీలేరు హెల్త్ సూపర్వైజర్‌లు పాల్గొన్నారు.

842వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవడం కోసం జరుగుతున్న ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఎంఇఎస్ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టియుసి) ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.బాబ్జీ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శనివారానికి 842వ రోజుకు చేరాయి. దీక్షలో ఎంఇఎస్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయాలని బిజెపి ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. దీక్షల్లో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.బుచ్చిబాబు, పిటి.రెడ్డి, ఎస్.ఉమ, కె.ధీరజ్ రవిచంద్ర పాల్గొన్నారు.

సెమిస్టర్ 2 పాఠ్య పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రభుత్వం అందించిన సెమిస్టర్ - 2 పాఠ్య పుస్తకాలను విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శనివారం శివాజీపాలెంలోని జివిఎంసి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఒకటి నుంచి ఐదో తరగతి పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వారి అకాడమిక్ స్టాండర్డ్స్‌ను పరీక్షించారు. వారి వర్క్ బుక్స్‌ను కూడా పరిశీలించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన టోఫెల్ టీచింగ్‌ను సమీక్షించారు. విద్యార్థులందరూ కలెక్టర్‌తో ఆనందంగా గడిపారు. ప్రశ్నలకు జవాబులిచ్చారు. విద్యార్థుల ప్రతిస్పందనకుగాను ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు.